




# హైదరాబాద్ వార్త

## పద్మారావునగర్‌లో చైన్‌స్నాచింగ్

సికింద్రాబాద్, జులై 19 ప్రభాతవార్త: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మారావునగర్‌లో బుధవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. వృద్ధురాలిని అడ్రస్ అడుగుతున్నట్లుగా చేస్తూ ఆమే మెడలోని చైన్‌ను తెంపుకుని పారిపో యాడు. పద్మారావునగర్ పార్కు సమీపంలోని సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల నివాసం పక్కనే వృద్ధురాలు నిలబడి ఉండగా 30 సంవత్సరాలు ఉన్న యువకుడు వచ్చి అడ్రస్ అడిగాడు. చెప్పేక్రమంలోనే యువకుడు చైన్‌ను లాక్కుపోయాడు. చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రాజాసింగ్‌తో ఈటల భేటీ

**సస్పెన్షన్ పై చర్చ త్వరలోనే నిర్ణయం వస్తుందని భరోసా ఈటెల**



శాసనసభ్యులు ఈటెల రాజేందర్,రాజాసింగ్‌లను సన్మానించిన గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు వి.పాండుయాదవ్

గోషామహల్,జూలై 19ప్రభాతవార్త: ఇటివల గోషామహల్ నియోజక వర్గం శాసనసభ్యులు టి.రాజాసింగ్ మంత్రి టి.హారీష్‌రావును కలిసిన నేపథ్యంలో రాజకీయంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.బిఆర్ఎస్ కీలక నేత,మంత్రి టి.హారీష్‌రావును కలువడంతో రాజాసింగ్ పార్టీ మారబోతున్నట్లు జోరు పుకార్లు అందుకున్నాయి. బుధవారం ఏకంగా బిజెపి ఎలక్షన్ కమిటి చైర్మన్, శాసనసభ్యులు ఈటెల రాజేందర్ దూల్‌పేట్‌లోని శాసన సభ్యులు టి.రాజాసింగ్ నివాసానికి వెళ్లారు.ఈటెల రాజేందర్‌ను శాసనసభ్యులు రాజాసింగ్, గోల్కొండ జిల్లా బిజెపి అద్యక్షులు వి.పాండుయాదవ్, నియోజకవర్గం బిజెపి నాయకులు,కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రాజేందర్,రాజాసింగ్‌లు సుమారు గంట పాటు చర్చించుకున్నారు. ముఖ్యంగా గత ఏడాది బిజెపి విధించిన సస్పెన్షన్‌పై ఈటలతో రాజాసింగ్ చర్చించారు.సస్పెన్షన్ ఎత్తివేసేలా అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని రాజా సింగ్‌కు ఈటల రాజేందర్ హామి ఇచ్చారు. తెలంగాణ బిజెపి ఎన్నికల కమిటి చైర్మన్‌గా,శాసనసభ్యులు ఈటెల రాజేందర్ రాజాసింగ్‌తో భేటికావడం రాజకీయంగా చర్చ మొదలైంది.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ మేయర్



సమస్యలను తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

తార్నాక, జులై 19 ప్రభాతవార్త: వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలను బుధవారం డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు డిప్యూటీ మేయర్ సూచించారు. ప్రజలు మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీం ద్వార ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాలాల్లో ఉన్న పూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, డ్రైనేజీ మూతలను సమస్యలను పరిష్కరించాలని బాక్స్‌డ్రైన్ దగ్గర ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటేష్, మిస్బా, నాయకులుల శివశంకర్, విజయ, కారంపుడి పద్మ, ఖాజ, ఫయాఖ్, నాను నాయక్ పాల్గొన్నారు.

# రోజంతా ముసురే..

**తడిసి ముద్దైన భాగ్యనగరం**

**గతరెండురోజులు ఎడతెరిపి లేకుండా వర్షం**

**ప్రధాన రోడ్లు, కాలనీల్లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు**

**గంటలకొద్ది ట్రాఫిక్ జాంతో వాహనదారులకు ఇక్కట్లు**

**ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ఉద్యోగులు**

**మరో ఐదురోజుల వర్షాలు**

**కురుస్తాయి : వాతావరణ శాఖ**







వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నష్టం కలగకుండా పాటించాల్సిన

హైదరాబాద్, జూలై 19,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో గత గతమూడు రోజులుగా పడుతున్న ముసురుతో నగరం తడిసిముద్దయ్యింది. సోమవారం రాత్రి జల్లులతో ప్రారంభమైన వర్షం బుధవారం రాత్రి వరకూ కొనసాగింది. ఉదయం వేళ పడుతున్న వర్షం కారణంగా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగం బజార్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ నారాయణగూడ, హిమాయత్‌నగర్, లక్డీకపూల్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. దీంతో వాహనాల వేగం ప్రధాన రహదారులపై నెమ్మదించింది. మంగళవారం రాత్రి వరకు గరిష్టంగా 20.0మి.మీ వర్షం గోల్కొండ, మియాపూర్‌లలో పడింది. మొత్తంగా 24గంటల వ్యవధిలో 3సెం.మీ వర్షం కురిసింది. అలాగే పలుచోటన విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. చంపాపేట్ డివిజన్‌లోని శెట్టినగర్‌లో 11కేవీ విద్యుత్ వైర్ తెగిపడి 3గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అమీర్‌పేట్,ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లోనూ విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం శేరిలింగపల్లిలో అత్యధికంగా 4.5 సెంటీమీటర్ల ,కనిష్టంగా రాజేంద్రనగర్‌లో 0.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో భాగ్యనగరానికి వాతా వరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేశా రు. అయిదు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నష్టం కలగకుండా పాటించాల్సిన చర్యలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ,వాతావరణ సమాచారాన్ని అనుక్షణం సమక్షిస్తున్నామని జిహెచ్‌ఎంసి ప్రకటించింది. బుధవారం రాత్రి వరకు 40కిపైగా ఫిర్యాదులు అంది నట్లు తెలిపారు. వాటిని ఎప్పుటికప్పుడు పరిష్కరించామని ఈవీడిఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ )డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. పౌరులందరూ వర్షాల నేపథ్యంలో సహాయం కోసం జిహెచ్‌ఎంసి కాల్ సెంటర్ 040-21111111 నెంబర్‌కు సంప్రదించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ కోరారు.

## దళితబంధు లబ్దిదారుల ఎంపికలో దళారుల జోక్యం ఉండొద్దు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, జూలై 19,ప్రభాతవార్త: దళితబంధు రెండవ విడత లబ్దిదారుల ఎంపికలో దళారుల జోక్యం లేకుండా చూడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తనఛాంబర్‌లో వివిధ నియోజకవర్గాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళితబంధు ఎంపికలో దళారులు ప్రమేయం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒంటరి మహిళలు, 60ఏళ్ల పైబడి వారిని, నియోజకవర్గాల పరిధి కానివారిని, దళితులు కానివారిని ఎంపిక చేయెుద్దని, అర్హులైన నిరుపేద దళితులను మాత్రమే ఎంపిక చేయాలని ప్రత్యేక అధికారులకు కలెక్టర్ సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి సరైన లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. దళిత బంధు యూనిట్ల పర్యవేక్షణకై అధికారులతో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లబ్దిదారులు వారు కొనుగోలు చేసే యూనిట్లు గుర్తింపు పొందిన ఏజెన్సీల వద్దే తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఇద్దరు సోదరుల అదృశ్యం



యాకుత్‌పుర, జూలై 19 ప్రభాతవార్త : పాతబస్తీలో ఇద్దరు అన్నదమ్ములు అదృశ్యమైన సంఘటన కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన అంజలీ కుమారులైన హేమంత్ శర్మ (18), ప్రేమ్ శర్మ (17)లు బోయిగూడ కమాన్‌లోని పువ్వుల డెకరేషన్ షాపులో పని చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీన ఇద్దరు సోదరులు కలిసి ఇంటి నుంచి పని కోసం బయలు దేరి వెళ్లారు. తిరిగి ఇంటికి ఇంత వరకు చేరుకోలేదు. అదృశ్యమైన హేమంత్ శర్మ,ప్రేమ్ శర్మల కోసం అన్ని చోట్ల గాలించిన ఫలితం లేక పోయింది. దీంతో తన ఇద్దరు కుమారులు కనిపించటం లేదంటూ తల్లి అంజలీ శర్మ కామాటిపుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బోనాల ఊరేగింపులో కొండ చిలువతో హల్‌చల్.. యువకుడి అరెస్ట్

**కొండ చిలువను స్వాధీనం చేసుకున్న జంతు పరిరక్షణ అధికారులు**



కొండ చిలువతో నృత్యం చేస్తున్న యువకుడు

చాంద్రాయణగుట్ట, జూలై 19 ప్రభాతవార్త : బోనాల జాతర అమ్మవారి ఘటాల ఊరేగింపులో ఓ కళాకారుడు మెడలో కొండ చిలువ వేసుకొని నృత్యం చేసిన సోషల్ మీడియాలో కలకలం రేపింది. సోమవారం ఈ ఘటన శాలిబండా పోలీసు స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన కళాకారుడు రాంపల్లి సాయికుమార్(25) ఈ నెల పాతబస్తీలో 17వ తేదిన పాతబస్తీలో జరిగిన అమ్మవారి ఘటాల ఊరేగింపులో కళాకారుడి నృత్యం చేయడానికి వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కొండ చిలువను ఊరేగింపుకు వచ్చిన ప్రజల ముందు మెడలో వేసుకొని ప్రాణాంతక విన్యాసాలఉ చేస్తూ జంతు పరిరక్షణ అధికారులకు చిక్కాడు. అతని వద్ద నుండి కొండ చిలువను స్వాధీనం చేసుకొని కళాకారుడిని శాలిబండా పోలీసులకు అప్పగించారు. పోలీసులు యానిమల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మాన్‌సూన్ రెగట్టా పోటీల్లో తెలంగాణ అమ్మాయిల హవా

**అగ్రస్థానంలో నిలిచిన దీక్షిత కొమరవెల్లి**



హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త: గత రెండు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న మాన్‌సూన్ రెగట్టా పోటీల్లో తెలంగాణ అమ్మాయిల హవా కొనసాగింది. స్థానిక సెయిలర్లు ధరణి లావేటి - వడ్ల మల్లేష్, బాలిక విభాగంలో దీక్షిత కొమరవెల్లి అగ్రస్థానంలో నిలిచారు. దీక్షిత కూడా కొన్ని అద్బుతమైన ముగింపులతో అబ్బాయిలకు దడపుట్టించింది. అండర్ 15 విభాగంలో హైదరాబాద్‌లోని యాచ్‌క్లబ్‌కు చెందిన సెయిలర్, తెలంగాణకు చెందిన దీక్షిత బాలికల లీడర్‌బోర్డులో అగ్రస్థానంలో నిలిచారు. ఓపెన్ విభాగంలో సైతం ఇతరులను వెనక్కి నెట్టి మూడోస్థానంలో నిలిచారు. ఆమెకంటే ముందు ఇద్దరు అబ్బాయిలు మాత్రమే ఉన్నారు. దీంతో దీక్షిత బంగారు బంగారు పథకం సాధించే దిశగా సాగుతుంది. ఆమె తరువాత స్థానంతో ఉన్న షగున్‌ఝా 35పాయింట్లు వెనకబడి ఉంది. అలాగే స్థానిక తెలంగాణ జోడీ టాప్‌సీడ్ ధరణి -మల్లేష్‌లు నైన్సీ అనిరాజ్ జోడిపై మూడు వరుస విజయాలు సాధించారు. అండర్ 15 బాలుర విభాగంలో అప్టిమిస్ట్ క్లాస్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం మరోసారి ఆదిపత్యం ప్రదర్శించి ట్రోఫీ గెలుపు దిశగా పయనిస్తున్నాడు. కాగా బుధవారం గ్రీన్‌ప్లీట్, లైట్ ప్లీట్‌లు రేసింగ్‌లో పాల్గొనగా గురువారం టీమ్ రేసింగ్‌లు జరగనున్నాయి.

## 10న ఎన్‌హెచ్‌ఎం స్కిమ్‌లో పనిచేసే ఉద్యోగ, కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె

**ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మ

సైఫాబాద్, జులై 19 ప్రభాతవార్త: తమ సర్వీస్‌లను క్రమబద్ధికరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) స్కిమ్‌లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్స్, ఉద్యోగులు, కార్మికులు ఆగస్టు 10న ఒక రోజున జరిగే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ పిలుపునిచ్చారు. బుధవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఎన్‌హెచ్ఎం స్కిమ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.నర్సింహ్మ మాట్లాడుతూ ఈ పథకంలో సంవత్సరాల తరబడి మెడికల్ ఆఫీసర్స్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు, డెంటిస్టులు, అకౌంటెంట్స్, డెటా ఎంట్రి ఆపరేటర్లు, ఎస్సీడి కౌన్సిలర్స్, బ్లాక్ లెవల్ అకౌంటెంట్స్, కాంటిజెంట్ వర్కర్స్, బస్తీ దవాఖానా సపోర్టింగ్ స్టాఫ్,ఎంసిహెచ్ హాస్పటల్ సెక్యూరిటి గార్డ్స్, వాచ్‌మెన్‌లు, స్వీపర్లు ఈ సమ్మెలో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ నాయ కులు ఎస్.రేవతి, సునీత, సుల్తానా, లావణ్య, నాగజ్యోతి, మనీ,మధు, హేమంత్, సురేష్, లోకేష్, శిరిష, ఎ.నీరజ, ప్రమీలా, సౌజన్య, శ్రావంతి, కావేరి, విజయకు మారి, హారిక, నరసింహ పాల్గొన్నారు.

## సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఒయులో విద్యార్థుల నిరసన

**వైస్ చాన్స్‌లర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసిన విద్యార్థులు**



ఒయులో రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తార్నాక, జులై 19ప్రభాతవార్త: సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఓ.యూలో విద్యార్థులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పూర్తిగా సిలబస్ పూర్తి చేయకుండానే సెమిస్టర్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని విద్యార్థులు ప్రశ్నించారు.భారీ వర్షం కురుస్తున్నప్పటికి భారీ సంఖ్యలో విద్యార్థులు క్యాంపస్ రోడ్డుపై భైటాయించి వైస్ చాన్స్‌లర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు నాలుగుగంటల పాటు వారు నిరసన వ్యక్తం చేశారు. 120 వర్కింగ్ డేస్ తరువాతనే పరీక్షలు నిర్వహించాలనే యూజీసీ నిభందన ఉన్నప్పటివకి పరీక్షలను ఎలా నిర్వహిస్తారని వారు ప్రశించారు. నిరసనల కారణంగా వర్సిటీలో పోలీసులు భారీగా మోహరించి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా బందో భస్తు నిర్వహించారు.నిబంధనల ప్రకారం 4నెలల పాటు తరగతులను నిర్వహించిన తరువాతనే సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా వైస్ చాన్స్‌లర్ పరీక్షలను నిర్వహించడం సరైన పద్దతి కాదని విద్యార్థులు వాపోయారు. పోటీ పరీక్షలకు తాము ప్రీపేర్ అవుతున్న సమయంలో పరీక్షలను నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. అగుస్టులో జరుగనున్న గ్రూప్ పరీక్షలకు కొందరు సిద్దమవుతున్నారని ఈ సమయంలో సెమిస్టర్ పరీక్షలను ఎలా నిర్వహిస్తారని విద్యార్థులు ప్రశ్నించారు. పరీక్షల నేపథ్యంలో ఆగస్టు 20 నుంచి పరీక్షలను షెడ్యూల్ చేయాలని విద్యార్థులకు తగినంత సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో పలువురి విద్యార్థులను అరెస్టు చేసి అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**సెమిస్టర్ పరీక్షలు నిర్ణయించిన తేదీలోనే జరుగుతాయి: రిజిస్ట్రార్**

సెమిస్టర్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ పేర్కొన్నారు. పరీక్షలను యధాతంగా ఉంటాయని విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసిందే నని చెప్పారు. ముందుగానే సెమిస్టర్ పరీక్షల తేదిని తాము ప్రకటించడం జరిగిందని వెల్లడించారు.

## ఉద్యోగులు చేస్తున్న అక్రమాలపై ఫిర్యాదు



ఆర్.టి.ఏ జాయింట్ కమిషనర్ పాండు రంగ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందచేస్తున్న జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

గన్‌ఫౌండ్రి, జూలై 19ప్రభాతవార్త: తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ, కార్యవర్గం ఆద్వర్యంలో ఆర్.టి.ఏ జాయింట్ కమీషనర్ పాండు రంగ నాయక్‌ను కలిసి ఆర్.టి.ఏ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు చేస్తున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అందుకు ఆయన విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ కార్యాలయంలో కొందరు అవినీతి కార్యక్రమాలు చేస్తున్నారని,ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులైన మహ్మద్ గౌస్, వెంకట రమణలపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయని వారిని వెంటనే బదిలీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు వివరించారు.మూడు రోజులల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జాయింట్ కమీషనర్ కూడా వారిపై విచారణ చేయిస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్, కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్ రాజ్‌కుమార్,కె.శ్రీని వాస్, ఖాలేద్ అహ్మద్,వైదిక్‌శర్మ,శంకర్,ముఖీమ్, శ్రీధర్,ఆర్.టిఏ యూనిట్ అధ్యక్షులు అరుణేందర్,కార్యదర్శి పవన్,వివిధ విభాగాల యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎల్ఓసి లెటర్ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, జూలై 19,ప్రభాతవార్త: బాగ్‌అంబర్‌పేట్ డివిజన్ దోభీ గల్లీకి చెందిన కె.సంతోష్‌కుమార్ అన్యారోగ్యంతో బాధపడుతూ ఇటీవల నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ద్వారా ఎల్ఓసికి దరఖాస్తు చేసుకోగా 2,50,000 మంజూరైంది. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బాధిత కుటుంబసభ్యులకు లెటర్‌ను అందజేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో జూనియర్ వైద్యులు ఆందోళన

అఫ్జల్‌గంజ్, జూలై 19 ప్రభాతవార్త: పెరుగుతున్న రోగులకు అనుగుణంగా ఉస్మానియా ఆసుపత్రిలో నూతన ఆసుపత్రి భవనం నిర్మించాలని కోరుతూ ఉస్మానియా ఆసుపత్రి అవరణలో ఓపి బ్లాక్ వద్ద జూనియర్ వైద్యులు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా డాక్టర పవన్ మాట్లాడుతూ ఉస్మానియా ఆసుత్రిలో పేద రోగుల సౌకర్యార్థం త్వరలో నూతన భవన నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని జెఏసీలు,జూనియర్ వైద్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భవనం నిర్మాణంపై తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హారీష్‌రావు గతంలో వారం రోజుల్లో హైకోర్టుకు దాఖాలు చేస్తానని చెప్పి హామి పదిహేను రోజులు గడుస్తున్నాప్పటికి ఏమాత్రం పట్టించు కోవడం లేదన్నారు.వైద్యం కోసం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం వస్తుంటారన్నారు. వారి అవసరాల నిమిత్తం ఇక్కడ కొత్త భవనం కావాలని గత 10సంవత్సరాల నుంచి జూనియర్ వైద్యులు పలు విధాలుగా ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నూతన భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయాలని,లేని పక్షంలో జూనియర్ వైద్యులు ప్రభుత్వంతో పోరాటానికి భవిష్యత్తు కార్యాచరణ చేపడుతామన్నారు. ఈ ఆందోళనలో పవన్,రాజేష్,మనోహార్ తదితరులు పాల్గొన్నారు.

## గూడ్స్ ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



యాకుత్‌పుర,జూలై 19 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. ప్రభుత్వ సిటీ కళాశాల వద్ద గల ఎంజె బ్రిడ్జిపై నుంచి యాభై ఐదు సంవత్సరాలు నుంచి అరవై సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గూడ్స్ ఆటో ఢీ కొట్టింది.ఈ సంఘటనలో అతని తలకు బలమైన గాయాల కావటంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.చని పోయిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్ర పరిచారు.ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సాయివరప్రసాద్ హత్య కేసులో నిందితుల అరెస్టు.. రిమాండ్

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సాయివరప్రసాద్ హత్య కేసులో నిందితులుగా గుర్తించిన వారిని పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపారు. మీర్‌పేట్ సర్వోదయనగర్‌కు చెందిన మానుపాటి సాయి వరప్రసాద్ (22) గత ఆదివారం అర్ధరాత్రి జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ చౌరస్తాలో జరిగిన గొడవలో కత్తి పోట్లకు గురై పిసల్‌బండ చౌరస్తా సమీపంలోని ఒవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందిన సంగతి విదితమే. అయితే హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసులో నిందితులైన మీర్‌పేట్ పాత గ్రామానికి చెందిన ఎరుకల నితీస్‌కుమార్ గౌడ్ (23), ఆర్ఎన్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పోచారం గ్రామానికి చెందిన ఇందుర్తి మహేందర్‌రెడ్డి (20), జిల్లెలగూడ శ్రీసాయినగర్‌కు చెందిన కుంటల సాయికిరణ్‌గౌడ్ (31), జిల్లెలగూడ వివేక్‌నగర్‌కు చెందిన నిమ్మగూడెపు మనోహర్‌గౌడ్ (34), శంషాబాద్ మండలం పెద్ద తుప్పర గ్రామానికి చెందిన కాటుకూరి సురేష్‌గౌడ్ (36), కాటుకూరి వెంకటేష్‌గౌడ్ (39)లను బుధవారం కోర్టులో హాజరుపరచగా జ్యూడిషియల్ రిమాండ్ అయినట్లు మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం బారాస ప్రభుత్వమేనని, నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత ఉన్నత అధికారులు, పోలీస్ శాఖతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల రూ.3016 ఉన్న దివ్యాంగుల పింఛన్ నేడు రూ.4016కు కేసీఆర్ పెంచడం హర్షణీయమన్నారు. డబల్ బెడ్ రూమ్‌లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు ప్రత్యేక కోట ఇస్తున్నామని, అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులు ప్రతిఒక్కరికి డబల్ బెడ్ రూమ్ వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇచ్చిన తరువాతే మిగతా వారికి అందజేయాలని అధికారులకు సూచించారు. దళితుల్లో దివ్యాంగులైన వారు ఉంటే వెంటనే దళిత బంధు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు తన దృష్టికి తీసుకొస్తే వారికి డబల్ బెడ్ రూమ్ అవకాశం కల్పిస్తామన్నారు. 2016 చట్టం ప్రకారం దివ్యాంగులకు రావాల్సిన న్యాయమైన కోటాను తన నియోజకవర్గ పరిధిలో అమలు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. త్వరలో దివ్యాంగులు, సంబంధిత అధికారులతో కలిసి వర్క్ షాపు నిర్వహించేందుకు కృషి చేస్తానని, దివ్యాంగుల చట్టంపై కూడా అందరికీ అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజేశ్వర్ రెడ్డి, విక్రాంత్, రాజేష్, బలరాం, అశ్వినికుమారి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మద్దెల గంగారాం, చెరుకు నాగభూషణం, అందే రాంబాబు, నారా నాగేశ్వరరావు, పూల నాగరాజు, వంశరాజ్ రామచందర్, వేణు, కోటి, శ్రీనివాస్, విద్య, సుజాత, విజయ, స్వప్న, అనసూయ పాల్గొన్నారు.

## ఎల్.బి.నగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో ఉప కమిషనర్ల బదిలీలు

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** ఎల్.బి.నగర్, హయత్‌నగర్, సరూర్ నగర్ సర్కిళ్లలో ఉప కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్బీనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డి గత వారమే బదిలీ అయ్యారు. ఆయనను నార్సింగ్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించగా ఆయన స్థానంలో టి.దశరథను ఎల్బీనగర్ ఉపకమిషనర్‌గా నియమించారు. హయత్‌నగర్ ఉపకమిషనర్ మారుతి దివాకర్ ను అంబర్ పేట సర్కిల్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో కూకట్‌పల్లి ఉప కమిషనర్ పి.రవీందర్‌కుమార్‌ను నియమించారు. సరూర్ నగర్ ఉప కమిషనర్ హరికృష్ణయ్యను కూకట్‌పల్లి ఉప కమిషనర్‌గా బదిలీ చేసి ఆయన స్థానంలో ఉప్పల్ ఉప కమిషనర్ అరుణకుమారిని నియమిస్తూ జిహెచ్ఎంసి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## తెలంగాణాలో బిజెపిదే అధికారం : నల్లు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఇంద్రసేనారెడ్డి

**సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త :** రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. భాగ్యనగర్‌జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ ఎస్‌బిహెచ్ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీహాల్‌లో 'టిఫిన్ బాక్స్ బైఠక్ పేరిట ఏర్పాటు చేసిన మలక్‌పేట నియోజకవర్గం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని అన్నారు. బిజెపి కార్యకర్తలందరు బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ భాగ్యనగర్ జిల్లా పరిధిలో బిజెపి తన సత్తాను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్‌తో పాటు నియోజకవర్గంలోని బిజెపి కార్పొరేటర్లు, డివిజన్ కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు లేకపోవడంతో బురదమయంగా మారిన కాలనీలు : కార్పొరేటర్ పవన్

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** అవసరమైన చోట రోడ్లు నిర్మించకపోవడంతో కాలనీలు పూర్తిగా బురదమయంగా తయారయ్యాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ పర్యటించి బురదమయంగా మారినరోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ డ్రైనేజ్ పనులు పూర్తయిపోయిన రోడ్లు మరమ్మత్తులకు నోచుకోలేదన్నారు. వర్షాకాలంలో మొత్తం బురదగా మారి కాలనీ ప్రజలు నడవడానికి వీలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఏఈ మాతృనాయక్‌కి ఫోన్ చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే రోడ్లను మరమ్మత్తు చేయించాలని సూచించారు. స్ట్రాం వాటర్ డ్రైనేజ్ పనులు పూర్తయిన ఇంకా మరమ్మత్తులు ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శుక్లా , రమణ, మంచి రాజేష్, యూ రామకృష్ణ, కొత్త తిరుమల, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మలక్‌పేట శ్రీ పోచమ్మ ఆలయ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు

**మలక్‌పేట, జూలై 19 ప్రభాతవార్త :** మలక్‌పేట శ్రీ పోచమ్మ దేవాలయ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాన్ని పంచశీల గ్రంథాలయంనుండి నిర్వాహకులు చందు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.టి.శంకర్‌ముదిరాజ్ మాట్లాడుతూ మలక్‌పేట పరిసర ప్రాంతాల్లో మేళ తాళాలమధ్య అమ్మవారి ఫలహార బండిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరీష్, నరేంద్రముదిరాజ్, ప్రవీణ్‌కుమార్, అనిల్‌కుమార్, శ్రీధర్, వెంకటేష్, టిన్నుసింగ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## సాంప్రదాయాల పరిరక్షణకు కళా వైభవం తోడ్పాటు : సూగూరు రమేష్


కళావైభవం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

**మలక్‌పేట, జూలై 19 ప్రభాతవార్త :** సాంప్రదాయాల పరిరక్షణకు కళా వైభవం తోడ్పాటు అందిస్తుందని శ్రీ హరిహరక్షేత్రం ట్రస్ట్ ఛైర్మన్ సూగూరు రమేష్ పేర్కొన్నారు. మలక్‌పేట పల్టాన్‌లోని హరిహర క్షేత్రం, మైసమ్మ ఆలయంలో ప్రతి ఆదివారం సాయంత్రం 7గంటలనుండి చిన్నారులకు కళా వైభవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలగురించి చిన్నారులు తెలియజేసి ఉత్తమ పౌరులుగా, సంఘ సేవకులుగా, ధర్మ పరిరక్షకులుగా తీర్చిదిద్దడానికి కళా వైభవం అనే సాంప్రదాయ కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పురాణ కథలు, శ్లోకాలు నేర్పించడం, పండుగల విశేషాలగురించి తెలియజేయడం జరుగతుందని గాయత్రిశర్మ పిల్లలకు పాటలు నేర్పించడంతోపాటు పాటకు సంబంధించిన ఆడియో, లిరిక్స్‌ను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఓ మార్తాండరావు, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖరశర్మ, ఆలయ సభ్యులు శెట్టి విజయ్‌కుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణు అగర్వాల్, బి.పారిజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హడావిడి తప్ప అభివృద్ధి శూన్యం: సామ


కార్యక్రమంలో పాల్గొన్న సామ రంగారెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో అభివృద్ధిని విస్మరించి హడావిడికే అధికార పార్టీ నాయకులు పరిమితం అయ్యారని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికి బిజెపి కార్యక్రమం నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీలో సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ 9 సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత పాలనతో ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పనిచేస్తుందని విమర్శించారు. నాగోల్‌లో గతంలో మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని నివాసాలు పెరగడంతో దానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికి పొంగి డ్రైనేజీ పొంగి రోడ్లు జలమయం అవుతున్నాయని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల కూపంలోకి నెట్టి వేశారన్నారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్, పార్టీ మారిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభివృద్ధి చేస్తామని హడావిడి చేసారు తప్ప ఇంతవరకు ఎస్ఎన్‌డిపి పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మోసపూరిత బిఆర్ఎస్ పార్టీని గద్దె దింపి బీజేపీకి పట్టం కట్టాలని కోరారు.

## బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా బి.సుమన్‌రావు

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమీషనర్‌గా బి.సుమన్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. కోవిడ్ ప్రారంభమైన సంవత్సరం 2020 నుండి ఇక్కడ కమీషనర్‌గా పని చేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి పురపాలక పరిపాలన శాఖ కార్యాలయానికి జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అయితే బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు నూతన కమిషనర్‌గా కరీంనగర్ జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పని చేస్తున్న బి.సుమన్‌రావును బదిలీ చేశారు. గతంలో ఆయన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా సమర్థవంతంగా పని చేసి అందరి మన్ననలను అందుకోవడం జరిగింది. అయితే గురువారం ఆయన బడంగ్‌పేట్ కు వచ్చి కొత్త కమీషనర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

## పొంగులేటికి మనోహర్‌రెడ్డి అభినందన


పొంగులేటిని అభినందిస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ కో-ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఖమ్మం మాజీ ఎంపిపి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, కెఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి సన్మానించి అభినందనలు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నాయకులు బొల్లారం వెంకట్‌రాంరెడ్డి, గుల్ల సంతోష్ ముదిరాజ్ తదితరులతో కలిసి పొంగులేటి నివాసానికి తరలివెళ్ళి అక్కడ శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపట్ల పవన్, మట్ట నర్సింగ్‌రావు, నర్సింగ్ యాదవ్, కార్తీక్‌రెడ్డి, కొల్లూరు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** ఆర్‌కెపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లామైసమ్మ తల్లి దేవాలయ ఫలహారం బండి విజయ్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మగుడి వద్ద ఊరేగింపును మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పున్న గణేష్ నేత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భాస్కర్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, నాయకులు తలాటి రమేష్ నేత, జ్ఞానేశ్వర్ యాదవ్, ఎన్ఎస్‌యుఐ శివ, కల్యాణ్ యాదవ్, పెద్దవూర సైదులు, శ్రావణ్ కురుమ, శ్రీధర్, టెగర్ శివ, శ్రీకాంత్‌రెడ్డి, విప్లవరెడ్డి, నగేష్, శ్రీకాంత్, అనిల్‌రెడ్డి, దయాకర్, శివ, కార్తీక్, అనుదీప్, సాయి, మహేష్, గణేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సాయివరప్రసాద్ హత్యను రాజకీయం చేయవద్దు

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** జిల్లెలగూడలో హత్యకు గురైన సాయి వరప్రసాద్ విషయంలో రాజకీయాలు చేయవద్దని మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి కోరారు. సాయివరప్రసాద్ హత్య జరిగితే బిజెపి నాయకులు రాద్ధాంతం చేసి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్వయంగా హతుడి నివాసానికి వచ్చి బాధిత కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు కామేష్‌రెడ్డి తెలిపారు. సాయివరప్రసాద్ కుటుంబ సభ్యులు సైతం తమ వద్దకు ఎవరైనా వచ్చి సాయం చేయండి.. కానీ రాజకీయాలు చేయవద్దని కోరారని ఆయన వెల్లడించారు.

## అభివృద్ధి వైపే ప్రజల చూపు : మంచిరెడ్డి
### కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో భారీగా చేరికలు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు..

**తుర్కయంజాల్, జూలై 19 ప్రభాతవార్త :** అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ రొక్కం సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు జరిగాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తెలంగాణ ప్రజానీకాన్ని ఏకతాటి పైకి తీసుకువచ్చిన నాయకుడు సిఎం కెసిఆర్ అన్నారు. అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధిలో దేశంలో నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కెసిఆర్‌దేనని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఎన్నో కుంటుంబాలలో వెలుగు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్యామ మల్లేష్, రంగారెడ్డి జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఏనుగు ఆనంద్‌రెడ్డి, కందాడ ముత్యంరెడ్డి, బలదేవ్‌రెడ్డి, రామావత్ కళ్యాణ్‌నాయక్, వేముల అమరేందర్‌రెడ్డి, అశ్విని, కందాడ లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, మోహన్ గుప్తా, పుల్లగుర్రం విజయానంద్‌రెడ్డి, సంపతి ఈశ్వర్ రెడ్డి, కోంద్రు శీను, మేతరి శంకర్, జొన్నాడ సుదర్శన్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

**బీఆర్ఎస్‌లో చేరికలు...** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, హయత్‌నగర్ మండల మాజీ ఎంపీపీ రొక్కం భీంరెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు జక్కా రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు బొక్క మన్మోహన్‌రెడ్డి, నాయకులు గుర్రం చంద్రశేఖర్‌రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, మరియమ్మ చెన్నయ్య, కాంగ్రెస్ కౌన్సిలర్లు రొక్కం అనిత చంద్రశేఖర్ రెడ్డి, మర్రి మాధవిమహేందర్‌రెడ్డి, నారని కవితశేఖర్‌గౌడ్, బొక్క శ్రీలత గౌతమ్, బొక్క రవీందర్‌రెడ్డి, కొంద్రు మల్లేష్‌లతో కలిసి వివిధ కాలనీవాసులు సుమారు 600 మంది కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీని వీడి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారనన్నారు.

## మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా వాణి బాధ్యతల స్వీకరణ


కమిషనర్ వాణికి పుష్పగుచ్ఛాన్నిచ్చి అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా ఎ.వాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత యేడాదిన్నర కాలంగా మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా సమర్థవంతంగా పని చేసిన చిట్టి నాగేశ్వర్‌రావు రామగుండంమున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మేడ్చల్‌జిల్లా నాగారం మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న వాణి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బుధవారం ఆమె మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా ఛార్జ్ తీసుకున్నారు. బదిలీఅయిన కమిషనర్ నాగేశ్వర్ రావు ఆమెకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. నూతన కమిషనర్ వాణి గతంలో కోరుట్ల, ఫీర్జాదిగూడ, నాగారం మున్సిపాలిటీల్లో పని చేశారు.

**అభివృద్ధికి సహకరించాలి...** కొత్త కమీషనర్‌గా వాణి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి హాజరై నూతన కమీషనర్‌కు పుష్పగుచ్ఛాన్నిచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేసి కార్పొరేషన్‌కు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ గోపినాథ్, టిపిఓ దేవానంద్, ఆర్ఓ అంజన్‌రెడ్డి, మేనేజర్ వెంకట్‌రెడ్డి, అకౌంటెంట్ సుహాసిని, వివిధ విభాగాల సిబ్బంది, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

**సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు బిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డిఆధ్వర్యంలో ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయ్‌నగర్‌లోని సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బి.అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.అమరేందర్‌సాగర్, కోశాధికారి బి.ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు కె.బుచ్చిరెడ్డి, తిరుపతయ్య, సంయుక్త కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్, శ్రవణ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వరదముంపు నుంచి విముక్తి: ఎమ్మెల్యే...** ఎస్ఎన్‌డిపి పనుల్లో భాగంగా లింగోజిగూడడివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో చేపడుతున్న పనులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్ర గార్డెన్స్‌నుంచి ఉదయ్‌నగర్ కాలనీ మీదుగా జరుగుతున్న పనులు, వంగ శంకరమ్మ గార్డెన్స్ నుంచి పద్మానగర్ మీదుగా జరుగుతున్న పనులు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. ఈ పనులు పూర్తయితే వరదనీటి ముంపు సమస్య నుంచి పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు ముద్ద కళ్యాణ్, చీర తిరుమలేష్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప కమిషనర్ హరికృష్ణయ్యకు ఆత్మీయ సన్మానం

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ ఉప హరికృష్ణయ్య సర్కిల్ పరిధిలోని అందరిని కలుపుకొని అభివృద్ధికి దోహదపడ్డారని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ 320డి జోన్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా అన్నారు. ఆయన ఉద్యోగరీత్యా కూకట్‌పల్లికి బదిలీ కావడం అనివార్యమే అయినప్పటికీ ఆయన సేవలు మరువలేనివని సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ టి.సురేందర్ తెలిపారు. హరికృష్ణయ్య బదిలీ నేపథ్యంలో బుధవారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాందార్ హైదరాబాద్, స్వచ్ఛ సర్వేక్షన్, హరితహారం కార్యక్రమాలను వివిధ స్వచ్ఛంధ సంస్థలు సమన్వయంతో విజయవంతం చేశారని, కరోనా విపత్కర పరిస్థితులల్లో వారి సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా 2023-24 డైరీని అందజేశారు. వీరితోపాటు డాక్టర్ ఇందిరాప్రియదర్శిని పాల్గొన్నారు.

## చిన్నపాటి వర్షానికి రెండు చోట్ల కూలిన చెట్లు - ధ్వంసమైన కార్లు


కూలిన చెట్లు ధ్వంసమైన కార్లు దృశ్యాలు

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** చిన్నపాటి వర్షానికి రెండు ప్రాంతాలలో రెండు చెట్లు నేలమట్టమయ్యాయి. చెట్టు ఒక కారుపై పడడంతో కారు ధ్వంసమైన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్.కె. పురండివిజన్ అల్కాపురి కాలనీలో చోటుచేసుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలికి కాలనీలో రోడ్డుపై నిలిపిన వాహనంపై చెట్టు పడింద ని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటన జరిగినట్లు సమాచారం తెలియడంతో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్‌రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సంఘటన జరిగిన వివరాలను తెలుసుకుని వెంటనే అధికారులకు సమాచారం తెలియజేయడంతో అధికారులు సిబ్బందితో వచ్చి చెట్టును తొలగించారు.

**పి అండ్ టికాలనీలో...** గడ్డి అన్నారం డివిజన్ పి అండ్ టి కాలనీలో కూడా చెట్టు కూలిపడిన సంఘటనలో ఓ కారు ధ్వంసమైంది. స్థానిక నాయకుడు లంక లక్ష్మీనారాయణ జరిగిన సంఘటనకు సంబంధించి అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు వచ్చి రోడ్డుపై నుంచి చెట్టును తొలగించారు.

## ప్రజా శ్రేయస్సు కోసమే పోలీస్ స్టేషన్లు : ఎమ్మెల్యే
### శక్తి వంచన లేకుండా పోలీసుల కృషి : సిపి చౌహాన్


పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్న సిపి డిఎస్.చౌహాన్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు శక్తివంతం లేకుండా కృషి చేస్తున్నారని రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్ చౌహన్ పేర్కొన్నారు. నాగోల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి సీపీ చౌహన్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి కార్పొరేట్ కంపెనీలు ప్రముఖ ఐటీ సంస్థలు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్నాయని తెలిపారు ఆయా సంస్థలలో పనిచేసే వారి రక్షణకోసం నిరంతరం పోలీసులు పని చేస్తున్నారని పేర్కొన్నారు, కల్తీ విత్తనాలు డ్రగ్స్ అక్రమ రవాణా తదితర నేరాలను అదుపు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనేక మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే నాగోల్ పోలీస్‌స్టేషన్ సొంత భవనాన్ని మరో చోట నిర్మిస్తామన్నారు. నాగోల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు నవచైతన్య యోజన సంఘం ప్రతినిధులు సహకరించడంపట్ల ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ప్రజా శ్రేయస్సుకోసం మరిన్ని పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ సత్యనారాయణ డిసిపి సాయిశ్రీ, ఏసిపి శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ తదితరులు పాల్గొన్నారు.


## సైబాబాద్‌లో కార్పొరేటర్ అరుణ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

**సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త :** బోనాల పండుగ సందర్భంగా సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఈటెల రాజేందర్,మాజీ పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక నాగులమ్మ దేవాలయంనుంచి ఫలహారం బండి ఊరేగింపు ప్రారంభమై ఏకలవ్యనగర్, మూడుగుళ్ల మీదుగా కొనసాగింది. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘటాల ఊరేగింపులో పాల్గొన్నారు.

**జయదుర్గాదేవి ఆలయంలో...** పూసలబస్తీలోని శ్రీ జయదుర్గాదేవి ఆలయంగల అమ్మవారికి హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ పార్లమెంటు సభ్యులు మంద జగన్నాథంలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కొరుదు భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యుత్ బిల్లు రూ. 75వేలను చెల్లించిన నందికంటి శ్రీధర్..


ప్రభుత్వ పాఠశాల సిబ్బందికి డబ్బులను అందిస్తున్న నందికంటి శ్రీధర్

**నేరెడ్‌మెట్, జూలై 19 ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ ప్రభుత్వ పాఠశాల విద్యుత్ బిల్లు గత కొన్ని సంవత్సరాల నుండి చెల్లించకపోవడంతో రూ. 75వేల రూపాయలు బకాయిగా ఉండిపోయింది. దీంతో విద్యుత్ అధికారులు పాఠశాలకు సరఫరా అయ్యే విద్యుత్‌ను నిలిపివేయడంతో విద్యుత్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ తన స్నేహితుల సహాయంతో విద్యుత్ బిల్లును చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాఠశాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. కొంతకాలంగా విద్యుత్‌లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల సమస్యను పరిష్కరించడంతో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాకో, ఎస్సీఎస్ ప్రసాద్, మదుసూధన్‌రెడ్డి, రమేష్, వేణు, పాండు, సంతోష్, శినాయుడు, యశ వ్వంత్, అమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.